సాక్షి ఆదిలాబాద్
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



కాంట్రాక్టర్ దోపిడీ

జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఓ కాంట్రాక్టర్ కార్మికుల పొట్ట కొడుతున్నాడు. చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న వారి జీతాల్లోంచి కోత విధిస్తున్నాడు. 8లో▸

'థింకింగ్ డే'కు హాజరు కావాలి

ఆదిలాబాద్‌టౌన్: థింకింగ్ డే పురస్కరించుకుని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆదిలాబాద్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈనెల 22న నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల స్కౌట్స్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు హాజరుకావాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. పతాకావిష్కరణతో పాటు విద్యార్థులతో సర్వమత ప్రార్థనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/19.0

వాతావరణం

పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా 'పది' పరీక్షలు



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సీఎస్, డీవోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 53 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు 10,401మంది రెగ్యులర్, 106 మంది ప్రైవేట్ విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఇందులో సీఎస్, డీవోలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రేషన్ డీలర్లు

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి డీలర్లకు బియ్యం తూకం వేయకుండానే బస్తాలను అందజేస్తున్నారని అన్నారు. అయితే కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసే సమయంలో ఒక్కో బస్తాకు 4నుంచి 5 కేజీల తరుగు వచ్చి నష్టపోవాల్సి వస్తుందన్నారు. బియ్యం తూకం వేసి సరఫరా చేయాలన్నారు. అలాగే రీసైక్లింగ్ చేసిన సంచుల్లో కాకుండా నాణ్యమైన సంచుల్లో బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్‌వో కిరణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీలర్లు హరీంద్ర, వెంకటేశ్, వినోద్, మోహన్ రెడ్డి, రామన్న, జాకీర్ పాల్గొన్నారు.

'బీజేపీది సర్వనాశన సంకల్పయాత్ర'



మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

ఎదులాపురం: బీజేపీ తలపెట్టింది విజయ సంకల్ప యాత్ర కాదని, సర్వనాశన సంకల్ప యాత్ర అని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రధాని అయిన తర్వాత దేశంలో రైతు, కార్మిక పోరాటాలు, ఆందోళనలు పెరిగాయన్నారు. కార్పొరేట్లకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. అలాగే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా పోయిందన్నారు. బండి సంజయ్ సంకల్ప యాత్రలో భాగంగా ఏ ముఖం పెట్టుకొని జిల్లాకు వస్తున్నారని ప్రశ్నించారు. సిమెంట్ ఫ్యాక్టరీ, ఎయిర్‌పోర్టు నిర్మాణం, ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్, గిరిజన వర్సిటీ జిల్లాకు తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, ఎస్.అరుణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, గణేశ్, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనాఖాన్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పోచారం తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

ఔరంగజేబులంతా ఏకమైనా.. నలుగురిని గెలిపించారు

- ఉమ్మడి ఆదిలాబాద్ వాసులకు శిరస్సు వంచి వందనాలు
- మోదీ అధికారంలోకి వస్తే ఆదిలాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ
- ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్‌కు శంకుస్థాపన
- బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఎంపీ బండి సంజయ్

కైలాస్‌నగర్/నేరడిగొండ/ఇచ్చోడ: అసెంబ్లీ ఎన్నికల్లో ఔరంగజేబులంతా ఏకమై బీజేపీ అభ్యర్థులను ఓడించేందుకు యత్నించినా ధీటుగా ఎదుర్కొని ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించిన చరిత్ర ఆదిలాబాద్ ప్రజలదని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. ఆపార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం జిల్లాలోని నేరడిగొండ, ఇచ్చోడతోపాటు ఆదిలాబాద్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలందరికీ శిరస్సు వంచి వందనాలు చెబుతున్నానన్నారు. జిల్లా ప్రజలదెబ్బకు బీఆర్ఎస్‌సోళ్లు ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారన్నారు. రాంమందిర్ నిర్మాణం కోసం తపించిన కరసేవకులను కాల్చి చంపిన ములాయం సింగ్ గతేమైందో, బతుకేమైందే ప్రజలు గ్రహించాలన్నారు. అయోధ్యలోనే రాముడు పుట్టారా అనిప్రశ్నించే నాకొడుకులా భవిష్యత్తును ఖతం చేస్తామని, అలాంటి పార్టీలకు భవిష్యత్తే లేకుండా చేస్తామన్నారు. నిర్మల్ జిల్లాలో రాంజీగోండ్ చరిత్రను తెరమరుగు చేసేందుకు వెయ్యి ఊడలమర్రి వద్ద సమాధి చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు సమాధి చేశారన్నారు. కాంగ్రెస్ మేల్కొని దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. వెయ్యి ఊడల మర్రి వద్ద రాంజీగోండ్ స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. దేశం కోసం పాటుపడుతున్న నరేంద్ర మోదీకి ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం బహుమతిగా అందించాలన్నారు. ఎంపీ సీటును గెలిపిస్తే ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామన్నారు. మరోసారి కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు ఏర్పడబోతుందని, అధికారం చేపట్టిన వెంటనే ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్‌కు మోదీతో శంకుస్థాపన చేయిస్తామన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. రాష్ట్రంలో ఖజానా లేదని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీలను ఏ విధంగా అమలు చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. కేసీఆర్ ఢిల్లీ వెళ్లేది కొత్త స్నాక్ రుచి చూసేందుకే తప్పా.. ఎలాంటి పొత్తుల కోసం కాదన్నారు. కేసీఆర్‌కు ఢిల్లీలో ఎవరు అపాయింట్మెంట్ ఇస్తారని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు సొంత వాహనాలు లేని చంద్రశేఖర్‌రావుకు లక్షల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. హిందువులు ఓటు బ్యాంక్‌గా మారకపోవడంతోనే రాష్ట్రంలో అధికారంలోకి రాలేకపోయామని, దేశానికి కావాల్సింది రామ రాజ్యమా.. రజాకార్ల రాజ్యమా అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులే కరువయ్యారని, అలాంటి పార్టీతో పొత్తు పెట్టుకోవాలా అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యాత్ర ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి, జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, మాజీఎంపీ రమేశ్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, పార్లమెంట్ కన్వీనర్ బోయర్ విజయ్, లోక ప్రవీణ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లాలామున్నా, వేదవ్యాస్, నాయకులు రాజేశ్ బాబు, అభినవ్ సర్దార్, సుహాసినిరెడ్డి పాల్గొన్నారు.

అధికారం పోయినా.. తీరుమారలే

ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నను ప్రజలు ఓడించి ఆ పార్టీని అధికారం లేకుండా చేసినా ఇంకా అధికారంలో ఉన్నట్లే మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. వంద మంది రామన్నలు వచ్చినా ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ గెలవడం ఖాయమన్నారు. ఆదిలాబాద్–ఆర్మూర్, ఆర్మూర్–పఠాన్‌చెరు వరకు 316 కిలో మీటర్ల దూరం ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయిందని, ఇందు కోసం రూ.7,313 కోట్లు కేంద్రం కేటాయించిందని పేర్కొన్నారు. ఆదిలాబాద్–గడ్‌చందూర్ రైల్వే లైన్ ఫైనల్ లొకేషన్ సర్వే కూడా పూర్తయిందని, రూ.1.75 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఈ విషయం తెలియని జోగు రామన్న రాజకీయ లబ్ధి కోసం రైల్వే సాధన సమితి పేరిట డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గతంలో పనిచేసిన ఎంపీలకు పిట్‌లైన్ అంటే తెలియదని, ఆదివాసీ బిడ్డగా దాన్ని తీసుకురావడం జరిగిందన్నారు.

ఢిల్లీలో మోదీ ఉండాల్సిందే..

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేళ్లలో ప్రధాని మోదీ ప్రపంచానికే నాయకత్వం వహించే దిశగా దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లారన్నారు. గల్లీ లో ఎవరున్నా ఢిల్లీలో మోదీ ఉండాలని ప్రజ లంతా కోరుకుంటున్నారన్నారు. తెలంగాణ లోనూ బీజేపీ గెలవడం ఖాయమన్నారు. అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ నేతలు గిలగిలా కొట్టుకుంటున్నారన్నారు. మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వర్గానికైనా న్యాయం చేసిందా అని ఆయన ప్రశ్నించారు.

'బండి'కి ఘన స్వాగతం..



క్రేన్ సాయంతో గజమాల వేస్తున్న నాయకులు

బీజేపీ పార్టీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా నిర్మల్ జిల్లా నుంచి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశించిన బండి సంజయ్‌కు నేరడిగొండ మండలం రోల్‌మామడ వద్ద పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. క్రేన్ సాయంతో గజమాల వేశారు. నేరడిగొండలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అక్కడినుంచి ఇచ్చోడకు చేరుకోగా పార్టీ శ్రేణుల స్వాగతం అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గుడిహత్నూర్‌లో ఓ స్వామిజీ నివాసంలో భోజనం చేసి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. మావల బైపాస్ వద్ద బండి సంజయ్‌కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అక్కడినుంచి 5కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీగా జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ప్రధానవీధులగుండా అంబేద్కర్ చౌక్‌కు యాత్ర చేరుకోగా, పార్టీ శ్రేణులు ఆయనను భుజాలపై ఎత్తుకొని స్వాగతం పలికారు.

పాత పద్ధతిలోనే 'ఏఎంసీ'

- పాలకవర్గాలకు రిజర్వేషన్లు కొనసాగింపు
- బోథ్‌కు నియామకం
- మిగతా వాటికి ఆశావహుల యత్నాలు



ఆదిలాబాద్ ఏఎంసీ కార్యాలయం

సాక్షి,ఆదిలాబాద్: వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గాల నియామకంలో కొత్త సర్కార్ పాత పద్ధతిలోనే రిజర్వేషన్లను పాటిస్తోంది. దానికి అనుగుణంగానే ఆయా కేటగిరీకి చెందిన వారిని పాలకవర్గ అధ్యక్షులుగా నియమిస్తుంది. జిల్లాకు చెందిన బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి చైర్మన్‌గా గంగయ్యను మంగళవారం నియమించింది. పాత పాలకవర్గాలను రద్దు చేసిన తర్వాత రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వ వైఖరి ఎలా ఉంటుందని అందరు ఆసక్తిగా ఎదురుచూశారు. తాజాగా పాత పద్ధతిలోనే రోస్టర్ పద్ధతిని పాటిస్తూ నియామకాలను చేపట్టింది.

మిగతా మార్కెట్లకు ఇలా..

బోథ్ మార్కెట్‌కు బీసీ జనరల్ కేటగిరీలో గంగయ్యను నామినేట్ చేశారు. ఇక జిల్లాలో మిగిలిన ఏఎంసీలకు పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. ఆదిలాబాద్, జైనథ్ ఓసీ(జనరల్) ఉండగా, ఇంద్రవెల్లి ఎస్టీ(జనరల్) కాగా, ఇచ్చోడ ఎస్టీ (మహిళ)గా రిజర్వు అయ్యాయి. ఆయా కేటగిరిలకు అనుగుణంగా కాంగ్రెస్ నాయకులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జీలు ప్రతిపాదించిన వారికే దక్కనున్నట్లు తెలుస్తోంది. ఇంద్రవెల్లికి సంబంధించి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించిన వారికి పదవి దక్కే అవకాశం ఉంది. బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడకు సంబంధించి ఆ పార్టీ సీనియర్ నేత కుమ్ర కోటేశ్ సతీమణి సత్యవతి పేరు ఖరారు కానున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఆదిలాబాద్, జైనథ్ మార్కెట్ కమిటీలకు సంబంధించి ఇంకా ఎవరి పేర్లు సూచించనట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి స్థానికంగా లేకపోవడంతో ఇప్పటివరకు ఎవరి పేర్లు పరిశీలనలోకి రాలేదని సమాచారం. కాగా ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఇంటి స్థలాలివ్వాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

- కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ధర్నా

కైలాస్‌నగర్: తమకు ఇంటి స్థలాలు కేటాయించాలంటూ ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్‌కు చెందిన ఆదివాసీలు బుధవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి ప్రధాన ద్వారం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తామంతా కూలీనాలి చేసుకుని జీవించే నిరుపేదలమన్నారు. గతంలో పలువురు కలెక్టర్లకు వినతులు సైతం సమర్పించామన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి ప్రజావాణిలోనూ లేఖ అందించామన్నారు. స్పందించిన ప్రభుత్వం జిల్లాలో భూములను గుర్తించి వివరాలు పంపించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎక్స్ రోడ్ సమీపంలో 20 ఎకరాల ప్రభుత్వ భూమి సిద్ధంగా ఉన్నప్పటికీ తహసీల్దార్ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి తమకు ఇంటిస్థలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆర్డర్.. ఆర్డర్

- చర్చనీయాంశంగా పార్కు స్థలం కబ్జా
- హైకోర్టు నోటీసులతో రంగంలోకి దిగిన కమిషనర్
- స్థలం పరిశీలన.. ఆలయ నిర్మాణ పనుల నిలిపివేతకు ఆదేశం



స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీస్తున్న కమిషనర్ ఖమర్ అహ్మద్



పార్కు స్థలంలో చేపట్టిన ఆలయ నిర్మాణం

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో తాము ఆటలాడుకునేందుకు కేటాయించిన పార్కు స్థలం ఆక్రమణలకు గురవుతుందని, ఆ స్థలాన్ని కాపాడాలంటూ 23 మంది చిన్నారులు రాష్ట్ర హైకోర్టుకు లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆ స్థలాన్ని కాపాడాల్సిన అప్పటి కమిషనర్ శైలజ అక్రమార్కులకు అండగా నిలిచారని పేర్కొంటూ చిన్నారులు రాసిన లేఖను హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి విచారణ చేపట్టింది. కమిషనర్‌ను ప్రతివాదిగా చేర్చడంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. రాజకీయ పార్టీల్లోనూ అలజడి రేపింది.

నేపథ్యమేంటంటే..

పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ 1970లో ఏర్పడింది. పిల్లలు ఆటలాడుకునేందుకు గాను అప్పట్లో పార్కు కోసం 1.5 ఎకరాల స్థలం కేటాయించారు. 2000–04 మధ్య కాలంలో కొంతమంది 30గుంటల స్థలాన్ని ఆక్రమించారు. మిగిలిన స్థలాన్ని ఇటీవల ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరగడంతో ఆక్రమణను ఆపాలని కోరుతూ కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇటీవల బదిలీ అయిన కమిషనర్ దీనిపై పట్టించుకోకపోవడంతో చిన్నారులు హైకోర్టుకు లేఖ రాశారు. దీనిపై విచారించిన కోర్టు ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని ఉన్నతాధికారులను ఆదేశిస్తూ విచారణను మార్చి 7వ తేదీకి వాయిదా వేసింది.

స్థలాన్ని పరిశీలించిన కమిషనర్

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ హుటాహుటిన హౌసింగ్ బోర్డులోని ఆలయం నిర్మిస్తున్న పార్కు స్థలాన్ని బుధవారం పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి స్థలాన్ని సందర్శించిన ఆయన ఆలయ నిర్మాణ పనులు కొనసాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతుల్లేకుండా నిర్మాణాలు జరుగుతుంటే ఇన్నాళ్లు ఏం చేస్తున్నారని టీపీఓ అనురాధపై మండిపడ్డారు. పార్కు కోసం కేటాయించిన స్థలమెంత.. అందులో అక్రమణకు గురైన స్థలమెంత.. పూర్తి వివరాలతో కూడిన నివేదికను తనకు అందజేయాలని ఆదేశించారు. తదుపరి ఆదేశాల వరకు అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులు నిలిపివేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో పనులు నిలిచిపోయాయి. దాదాపు ఆలయం పూర్తయ్యే దశకు చేరుకోగా కోర్టు ఆదేశాల నేపథ్యంలో పనులు కొనసాగుతాయా లేదా అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఫిజికల్ సైన్స్, బయోలజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ బుధవారం నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. నిత్యజీవితంలో సైన్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. మూఢనమ్మకాలు వీడి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. కాగా పోటీల్లో బంగారుగూడ మోడల్ స్కూల్ విద్యార్థి బి హర్షవర్ధన్ (ప్రథమ), అదే పాఠశాలకు చెందిన హరీష్ (ద్వితీయ), జైనథ్ మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన శివకన్య (తృతీయ), తాంసి జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన బిందుజ నాలుగో స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో డైట్ వైస్‌ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఫోరం సభ్యులు రవీంద్ర, చంద్రశేఖర్, పోచరెడ్డి, సత్యనారాయణ, రాఘవేందర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో ప్రణీత

'డీఈవో అక్రమాలపై ఉద్యమిస్తాం'

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యాశాఖాధికారి అక్రమాలపై ఉద్యమిస్తామని టీఎస్ యూటీఎఫ్ నాయకులు అన్నారు. డీఈవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆ సంఘం నాయకులు డీఈవోతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, స్వామి మాట్లాడారు. డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టు కోసం నోటిఫికేషన్ విడుదల చేసి ఇద్దరు గణిత ఉపాధ్యాయులను ఎంపిక చేశారని పేర్కొన్నారు. తేజాపూర్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోవర్ధన్ పేరును ఎస్ఓగా ఖరారు చేసినప్పటికీ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రిలీవ్ చేయడం లేదని తెలిపారు. ఆయన స్థానంలో నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని మరో ఉపాధ్యాయుడిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని మండిపడ్డారు. గోవర్ధన్‌ను రిలీవ్ చేసి విధుల్లో చేర్చుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీడియోలు పోస్టు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



డీఎస్పీని సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్‌: రెడ్డి సంఘం పేరిట సోషల్‌ మీడియాలో అశ్లీల వీడియోలు పోస్టుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రెడ్డి సంఘం నాయకులు బుధవారం డీఎస్పీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు డీఎస్పీని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి కులస్తుల పేరిట పోస్టులు చేసి అవమానపర్చే విధంగా చేస్తున్నారని, వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, రాంరెడ్డి, శివప్రసాద్‌, స్వప్నిల్‌, కిరణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని తిర్పెల్లిలో గల ఖిల్లా హైస్కూల్‌లో ఈ నెల 19న రాత్రి చోరీ జరిగింది. మధ్యాహ్న భోజనానికి సంబంధించి పాఠశాలలో నిల్వ ఉంచిన 3 క్వింటాళ్ల బియ్యం, ఖాళీ గ్యాస్‌ సిలిండర్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాహెద బేగం టూటౌన్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు.

గంజాయి స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని సుభాష్‌నగర్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్‌ తెలిపారు. బేల మండలం సైద్‌పూర్‌ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న గూడకు చెందిన మడావి రాము గంజాయి సాగు చేస్తున్నారు. సుభాష్‌ నగర్‌కు చెందిన బాబాఖాన్‌, భార్య సాజిదాబీకి ముందుగా 1000 గ్రాముల గంజాయిని విక్రయించాడు. మిగిలిన మరో 200 గ్రాముల గంజాయిని గురువారం విక్రయించేందుకు తీసుకెళ్తుండగా సుభాష్‌నగర్‌ వంతెన సమీపంలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 1,200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్‌ చేసినట్లు ఎస్సై తెలిపారు.

సైన్స్‌ టాలెంట్‌ టెస్ట్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న పల్లవి

ఖానాపూర్‌: జాతీయ సైన్స్‌ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎఫ్‌పీఎస్‌టీ, టీబీఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ టాలెంట్‌ టెస్ట్‌లో ఖానాపూర్‌ విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన దాసరి పల్లవి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం సంధ్యారాణి, గైడ్‌ టీచర్‌ సుస్మారాణి, స్రవంతి తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుదని ఉపాధ్యాయులు తెలిపారు.

కాంట్రాక్టర్‌ దోపిడీ



రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న రిమ్స్‌ కార్మికులు

- వేతనం నుంచి రూ.2 వేలకు పైగా కోత
- రిమ్స్‌ కార్మికుల కష్టార్జితం కాంట్రాక్టర్‌ పాలు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- ఏడాదికి పైగా ఇదే తంతు
- నేటి నుంచి నిరసన..
- స్పష్టత ఇవ్వకపోతే మార్చి 7 నుంచి సమ్మె

ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌ (రిమ్స్‌)లో ఓ కాంట్రాక్టర్‌ కార్మికుల పొట్ట కొడుతున్నాడు. అసలే చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న వారి జీతాల్లోంచి కోత విధిస్తున్నాడు. కలెక్టర్‌ నుంచి డీఎంఈ స్థాయి అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. కార్మికుల పక్షాన ఉండాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సదరు కాంట్రాక్టర్‌ 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్న చందంగా మారింది. దీంతో విసుగుచెందిన కార్మికులు సమ్మె బాటకు సిద్ధమయ్యారు. గురువారం నుంచి రోజుకు గంట పాటు రిమ్స్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు. పరిస్థితిలో మార్పురాకుంటే మార్చి 7 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌కు సమ్మె నోటీసు అందజేశారు.

కార్మికుల పొట్టగొడుతున్న కాంట్రాక్టర్‌..

రిమ్స్‌లో అవుట్‌ సోర్సింగ్‌ పద్ధతిపై పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పేషెంట్‌కేర్‌లు దాదాపు 500 మంది పనిచేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌ కార్మికుల వేతనాల్లో కోత విధిస్తూ నిబంధనలను తుంగలో తొక్కి తనకు నచ్చిన విధంగా బ్యాంక్‌ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాడు. ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తారేమోననే భయంతో కార్మికులు ఏం చేయలేక పోతున్నారు. గతేడాది రిమ్స్‌కు వచ్చిన అప్పటి డీఎంఈ రమేశ్‌రెడ్డిని కార్మికులు కలిసి తమగోడు వెల్లబోసుకున్నారు. ఆ కాంట్రాక్టర్‌పై క్రిమినల్‌ కేసు నమోదు చేయడంతో పాటు కాంట్రాక్ట్‌ రద్దు చేస్తామని చెప్పారు. గతంలో పలుమార్లు ధర్నాలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు, అధికారులకు వినతి పత్రాలు అందజేసినా పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ల కోసం..

సదరు కాంట్రాక్టర్‌ దాదాపు రెండేళ్ల క్రితం రిమ్స్‌లో సెక్యూరిటీ గార్డ్‌, సానిటేషన్‌, పేషెంట్‌కేర్‌ అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగాల కోసం 0.01 (ఒకపైస) శాతం కమీషన్‌పై కాంట్రాక్ట్‌ దక్కించుకున్నాడు. నిబంధనల ప్రకారం నెలకు ఒక్కో కార్మికుడికి రూ.15,600 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రూ.12,093 కార్మికుడి ఖాతాలో జమ చేయాలి. రూ.3,023 పీఎఫ్‌ కట్టాలి. రూ.484 ఈఎస్‌ఐ జమ చేయాలి. ఇందుకు భిన్నంగా కార్మికులకు నెలకు రూ.11వేలు అకౌంట్‌లో జమ చేస్తున్నాడు. పీఎఫ్‌ రూ.వెయ్యి, ఈఎస్‌ఐ రూ.200 వరకు చెల్లిస్తున్నాడు. ఆస్పత్రి నిర్వహణ కోసం ప్రభుత్వం 5 శాతం కమీషన్‌ కాంట్రాక్టర్‌కు చెల్లిస్తుంది. తాను దక్కించుకున్న 0.01 శాతం కమీషన్‌ కూడా ఇస్తోంది. ఇది సరిపోదన్న రీతిలో కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాడు. అయితే అతను అందుబాటులో ఉండకుండా హైదరాబాద్‌లో ఉండటం, అక్కడి నుంచే వ్యవహారాలను సాగిస్తుండడంతో కార్మికులు తమ ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందంటున్నారు. అధికారులను ప్రశ్నిస్తే తమ చేతుల్లో ఏమీలేదని దాట వేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వేతనాల్లో కోత విధిస్తున్నాడు



గతంలో ఉన్న కాంట్రాక్టర్‌ కూడా పీఎఫ్‌ కాజేశాడు. ప్రస్తుత కాంట్రాక్టర్‌ సైతం వేతనాల్లో కోతలు విధిస్తున్నాడు. పలుమార్లు రిమ్స్‌ డైరెక్టర్‌తో పాటు డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం. నెలకు రూ.15,600 చెల్లించాల్సి ఉండగా, రూ.13వేల వరకు కూడా జీతం రావడం లేదు. కాంట్రాక్టర్‌ అందుబాటులో ఉండడం లేదు. వేతనం అందకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నాం.

– జి.సంగీత, పేషెంట్‌కేర్‌

జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి



ప్రభుత్వం విడుదల చేసిన జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి. కాంట్రాక్టర్‌ నిబంధనలు ఉల్లంఘించి వేతనాల్లో కోత విధిస్తున్నాడు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. నెలకు రూ.11వేలు మాత్రమే ఖాతాలో జమ అవుతున్నాయి. పీఎఫ్‌, ఈఎస్‌ఐ పోనూ నెలకు రూ.12,093 వేతనం అందాల్సి ఉంది. కాంట్రాక్టర్‌ ఇష్టారీతిన కోతలు విధిస్తున్నాడు.

– ముజీబ్‌, సెక్యూరిటీ గార్డ్‌

పరిష్కరించకుంటే సమ్మెబాట



కాంట్రాక్టర్‌ అవుట్‌సోర్సింగ్‌ కార్మికులను నిలువునా దోచుకుంటున్నాడు. ఒక్కో కార్మికుడి నుంచి ప్రతినెల రూ.2వేలకు పైగా వేతనంలో కోత విధిస్తున్నాడు. గురువారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతాం. సమస్య పరిష్కారం కాకపోతే మార్చి 7 నుంచి సమ్మెకు దిగుతాం.

–సిర్ర దేవేందర్‌, తెలంగాణ కాంట్రాక్ట్‌ అండ్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ రాష్ట్ర కార్యదర్శి

జాతీయ సమైక్యత శిబిరంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



శిబిరంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు

భైంసా: కర్నాటక ప్రభుత్వం గుల్బర్గా విశ్వవిద్యాలయంలో ఈ నెల 6నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు పాల్గొన్నారు. వీరితోపాటు కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌, ఒడిశా రాష్ట్రాల నుంచి జాతీయ సేవా పథకంలో పనిచేసే వలంటీర్లు హాజరయ్యారు. ఇందులో భాగంగా తెలంగాణ బతుకమ్మ, తెలంగాణ బోనాలు, పీర్ల పండుగకు సంబంధించి ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. పలు రాష్ట్రాలకు చెందిన వలంటీర్లంతా సమైక్యత శిబిరంలో పాల్గొనడం గొప్ప విషయమని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్‌ సతీశ్‌కుమార్‌ పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న వలంటీర్లను బుధవారం ట్రిపుల్‌ఐటీలో సన్మానించారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సంతోష్‌ కుమార్‌

లక్ష్మణచాంద(నిర్మల్‌): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఈడీఐఐ ప్రాజెక్ట్‌ కోఆర్డినేటర్‌ సంతోష్‌కుమార్‌ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఆక్సెంచర్‌ ఇంటర్‌ పినర్షిప్‌ డెవలప్‌మెంట్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇండియా వారి ఆధ్వర్యంలో మండలంలోని మహిళలకు ఆహారం, వ్యవసాయం (ఫుడ్‌ ప్రాసెసింగ్‌)పై ఉచిత శిక్షణ తరగతులను ఏడీసీసీ బ్యాంక్‌ మేనేజర్‌ శిరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్రెనింగ్‌ 26 రోజుల పాటు ఇక్కడే ఉంటుందన్నారు. మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీసీ రవి, దినేష్‌, ఈడీఐఐ మాస్టర్‌ ట్రైనర్‌ అలేఖ్య, ఏపీఎం శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

మేడారం వెళ్తున్న బస్సును ఢీకొన్న లారీ

- 20 మంది ప్రయాణికులకు గాయాలు



సంఘటన స్థలంలో బస్సు, లారీ



గాయపడిన లావణ్య



గాయపడిన చిన్నక్క



గాయపడిన అశ్రిత

మంచిర్యాలఅర్బన్‌: మంచిర్యాల డిపో నుంచి (కామారెడ్డి బస్సు) మేడారం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. మంగళవారం రాత్రి 9:30 గంటలకు మంచిర్యాలకు చెందిన 49 మంది ప్రయాణికులు ప్రత్యేక బస్సులో బయలుదేరారు. భూపాలపల్లి జిల్లా కాటారం సమీపానికి చేరుకోగానే రాత్రి దాదాపు 12:10 గంటలకు బస్సు, లారీ ఢీకొన్నాయి. ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. బస్సు డ్రైవర్‌ ఎంఎం అలీ కాలు, చేతులకు, ఇస్మాయిల్‌కు నడుం, కండక్టర్‌ బాలయ్యకు గాయాలయ్యాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. క్షతగాత్రులను భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జాతరకు వెళ్లి.. ప్రమాదానికి గురై...

మందమర్రిరూరల్‌: మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామానికి చెందిన ముప్పిడి చిన్నక్క, పెంచాల శ్రీనివాస్‌, ముడివెల్లి వెంకటేష్‌, నీలం సుశ్మిత కుటుంబ సభ్యులు ఆర్టీసీ బస్సులో మేడారం జాతరకు బయలుదేరారు. భూపాలపల్లి సమీపంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న బస్సును వెనుకనుంచి వచ్చిన బొగ్గు లారీ ఢీకొట్టింది. క్షతగాత్రులను భూపాలపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

నెన్నెల వాసులకు గాయాలు

నెన్నెల: భూపాలపల్లి జిల్లా మేడిపల్లి వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటనలో నెన్నెలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. పంచాయతీ మల్టీపర్పస్‌ కార్మికుడు తోట రాజేశ్‌, సుమలత, దంపతులు, అక్క తోట భూమక్కతో కలిసి మేడారం బయలు దేరారు. బస్సు ప్రమాదానికి గురికావడంతో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



తానూరు: పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌

తానూరు: భైంసా నుంచి తానూరు మండలం బెల్‌తరోడా గ్రామానికి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బెల్‌తరోడా రహదారిపై పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. బుధవారం భైంసా సుద్దవాగు నుంచి ట్రాక్టర్‌లో బెల్‌తరోడా గ్రామానికి ఇసుక తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు.

కుంటాలలో...

కుంటాల: మండలంలోని ఓలా వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ ను బుధవారం తహసీల్దార్‌ ఎజాజ్‌ అహ్మద్‌ఖాన్‌ పట్టుకున్నారు. ట్రాక్టర్‌కు రూ.5వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్‌ వెల్లడించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సారంగపూర్‌లో..

సారంగపూర్‌: మండలకేంద్రం మీదుగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకుని తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌ శ్రీదేవికి అప్పగించినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఇసుక అవసరం ఉన్న వ్యక్తులు తహసీల్దార్‌ వద్ద అనుమతి తీసుకున్న తర్వాతే ఇసుకను తరలించాలని, లేనిపక్షంలో వాహనాలు సీజ్‌ చేస్తామని హెచ్చరించారు.

దిలావర్‌పూర్‌లో...

దిలావర్‌పూర్‌: మండలంలోని కాల్వ గ్రామ పరిసర వాగునుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలపై అధికారులు దృష్టి పెట్టారు. బుధవారం వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్‌ బి.స్వాతి, మైనింగ్‌ అధికారి క్రాంతికుమార్‌ సీజ్‌ చేశారు. ట్రాక్టర్‌ను దిలావర్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు.

నేడు సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం సెపక్‌ తక్రా ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా అండర్‌–14, అండర్‌–18 క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు సెపక్‌తక్రా అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఎంపికైన జిల్లా క్రీడాకారులు ఈనెల 24, 25 తేదీల్లో నల్గొండలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు సెపక్‌తక్రా అసోసియేషన్‌ కార్యదర్శి భాస్కర్‌ 9948629413, కోచ్‌ కుమ్మరి మల్లేశ్‌ను 9032126050 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కొనసాగుతున్న సీబీఎస్‌ఈ 'పది' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్‌: సెంట్రల్‌ బోర్డు ఆఫ్‌ సెకండరీ (సీబీఎస్‌ఈ) పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత కేంద్రాలకు అనుమతించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్షలు జరిగాయి. కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో హిందీ పరీక్షకు 34 మంది విద్యార్థులు హాజరయ్యారు.

రైస్‌ మిల్లులో ఆకస్మిక తనిఖీ

- వెలుగులోకి ధాన్యం అక్రమాలు
- మిల్లులో 36,091 సంచులు మాయం



తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు

సిర్పూర్‌(టి): మండలంలోని వేంపల్లిలో శ్రీ లక్ష్మీనరసింహ రైస్‌మిల్లులో బుధవారం రెవెన్యూ అడిషనల్‌ కలెక్టర్‌ దాసరి వేణు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఇందులో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం మిల్లింగ్‌కు శ్రీ లక్ష్మీనరసింహ రైస్‌మిల్లుకు 38,265 బ్యాగుల ధాన్యం కేటాయించగా 2,174 బ్యాగుల ధాన్యం మాత్రమే అందుబాటులో ఉంది. అందులో 36,091 వరిధాన్యం బ్యాగులు కనుమరుగయ్యాయి. ఈ మేరకు శ్రీ లక్ష్మీ నరసింహా రైస్‌మిల్లుపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో సిర్పూర్‌(టి) తహసీల్దార్‌ శ్రీనివాస్‌, ఆర్‌ఐ ముబిన్‌, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాత్నాల కెనాల్‌లోపడి వృద్ధురాలు మృతి

జైనథ్‌: మండలంలోని మేడిగూడ(ఆర్‌) గ్రామానికి చెందిన బోడకుంట సుశీల (90) ప్రమాదవశాత్తు సాత్నాల కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. మృతురాలికి కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోవడంతో గ్రామంలో తిరుగుతూ ఉండేది. బుధవారం ఎప్పటిలాగే ఇంటి నుండి బయటకు వెళ్లింది. మధ్యాహ్న మేడిగూడ(సీ) గ్రామస్తులు కాలువలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి కుమారుడు బోడకుంట గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న మహిళ గుర్తింపు

మంచిర్యాలటౌన్‌: ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌ డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న మహిళను బుధవారం రాజీవ్‌నగర్‌కు చెందిన శ్రీరాముల వెంకటలక్ష్మి(41)గా ఆమె బంధువులు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతురాలికి భర్త మురళి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



అనిల్‌ (ఫైల్‌)

మందమర్రిరూరల్‌(చెన్నూర్‌): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని సీఎస్పీ రోడ్డు అంగడి బజార్‌కు చెందిన బండి అనిల్‌ (26) మేకల వ్యాన్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున పనినిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎర్రగుంటపల్లె రోడ్డు మూలమలుపు వద్ద కిందపడి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెంది ఉంటాడని మృతుని సోదరుడు బండి కుమార్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నికల వేళ ప్రక్షాళన

- అన్ని శాఖల్లో అధికారులకు స్థానచలనం
- విధుల్లో చేరిన అధికారులు

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లాలో బదిలీల కోలాహలం నెలకొంది. అన్ని శాఖల్లోనూ బదిలీల ప్రక్షాళన సాగుతోంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు దీర్ఘకాలంగా ఒకే చోట కొనసాగుతున్న అధికారులకు స్థానచలనం కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ మద్దతుదారులుగా ముద్రపడి ప్రజలు, ప్రతిపక్షాల నుంచి ఆరోపణలు ఎదుర్కొన్న వారందరినీ బదిలీ చేశారు. పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్‌, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌, రవాణాశాఖ ఇలా అన్ని శాఖల్లో ఉన్నతాధికారులు మారారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ సంతోష్‌ ఆధ్వర్యంలో ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈవీఎంల మొదటి స్థాయి పర్యవేక్షణ పూర్తి కాగా సెక్టోరియల్‌ అధికారుల శిక్షణ, ఎన్నికల సిబ్బంది సమాయత్తంపై చర్యలు చేపట్టారు.

పోలీసుశాఖలో..

రామగుండం పోలీసు కమిషనర్‌గా ఎం.శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల ఏసీపీగా ఆర్‌.ప్రకాశ్‌, జైపూర్‌ ఏసీపీగా వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీగా రవికుమార్‌ విధుల్లో చేరారు. జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, ఎక్సైజ్‌ సీఐ బదిలీపై వెళ్లారు.

- జెడ్పీలో సీఈఓగా గణపతి, డెప్యూటీ సీఈఓగా రవీందర్‌, డీఆర్‌డీఓగా కిషన్‌, మంచిర్యాల, బెల్లంపల్లి డీఎల్‌పీఓలు, జిల్లాలోని 16 మండలాల్లోని ఎంపీడీఓలు, 11 మండలాల్లో తహసీల్దార్లు, నస్పూర్‌, మందమర్రి, రామకృష్ణాపూర్‌, బెల్లంపల్లి, బెల్లంపల్లి మున్సిపల్‌ కమిషనర్లు, జిల్లా యువజన క్రీడల శాఖా అధికారి, డీపీఆర్‌ఓ బదిలీ అయ్యారు.

మూకుమ్మడిగా..

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలోని డీటీఓ, ముగ్గురు ఎంవీఐలు, ముగ్గురు ఏఎంవీఐలను మూకుమ్మడిగా బదిలీ చేశారు. వారి స్థానాల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు విధుల్లో చేరారు.

పొలాస విద్యార్థుల పొలంబాట



సాగు ప్రదర్శనలు పరిశీలిస్తున్న విద్యార్థులు

జైపూర్‌(చెన్నూర్‌): ఇప్పటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు పొలంబాట పట్టారు. ఫైనల్‌ ఇయర్‌ చదువుతున్న విద్యార్థులు బుధవారం జైపూర్‌ మండలంలోని వివిధ గ్రామాల్లో తిరుగుతూ పంటపొలాలను పరిశీలించారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో సేద్య విధానాలు, రైతులు సాగు చేస్తున్న పంటలు, వారి అనుభవాలు తెలుసుకున్నారు. అనంతరం జైపూర్‌ రైతు వేదికలో సామాజిక వనరుల గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తూలనం, ప్రెఫరెన్స్‌ ర్యాంకింగ్‌, సమస్యల చెట్టు, కాలక్రమం తదితర అంశాలపై ముగ్గులతో చిత్రాలు వేసి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ శివకృష్ణ, నాగరాజు, ఏడీఏ రాజేశం, ఏవో మార్క్‌గ్లాస్టన్‌, ఏఈవో కొమురయ్య, విద్యార్థులు హర్షిత్‌, సుశాంత్‌, శ్రీవత్స, రాంప్రసాద్‌, వివేక్‌ పాల్గొన్నారు.

ముమ్మాటికీ ఆర్థిక నేరస్తుడే

'మార్గదర్శి' పేరిట రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం ● ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ

నల్ల గురివింద
రామోజీ-1

- అవి అక్రమ డిపాజిట్లేనని సుప్రీంకోర్టులో ఆర్‌బీఐ వెల్లడి
- 2006 నాటికే రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు
- కేసులు విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్లు
- ఆ ముసుగులో భారీగా నల్లధనం దందా
- రామోజీ అక్రమాలకు చెక్ పెట్టిన నాటి వైఎస్సార్ ప్రభుత్వం
- అక్రమ డిపాజిట్లు తిరిగి చెల్లించేశామంటూ రాజగురువు బుకాయింపు
- ఎవరి నుంచి సేకరించారు.. ఎవరికి చెల్లించారో మాత్రం చెప్పరట
- నగదు రూపంలో డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమన్న ఐటీ శాఖ
- ఆర్‌బీఐ స్టేట్‌మెంట్ నేపథ్యంలో రామోజీకి శిక్షపై సర్వత్రా చర్చ

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరిట ఏళ్ల తరబడి సాగించిన అక్రమ డిపాజిట్ల వసూళ్లు.. నల్లధనం దందాపై 2006లో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఎట్టకేలకు ఫలించాయి. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు అక్రమ డిపాజిట్లు వసూలు చేశారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సుప్రీంకోర్టుకు విస్పష్టంగా నివేదించింది. దాంతో రామోజీ అవినీతి ఆట కట్టిందని, ఇక శిక్ష పడటమే మిగిలిందని నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండేళ్ల నుంచి గరిష్టంగా యావజ్జీవ జైలు శిక్ష పడే అవకాశం ఉందని కూడా చెబుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. దాంతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు సాగించిన ఆర్థిక అక్రమాల కథ కమామిషు మరోసారి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 2006లో అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే వరకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' అనే సంస్థ ఉన్నట్టు కూడా సామాన్యులకు తెలియదు. రాష్ట్రం అంతటా 'మార్గదర్శి చిట్ ఫండ్స్' కార్యాలయాలే కనిపిస్తూ ఉండేవి. కానీ ఆ కార్యాలయాల్లోనే గుట్టు చప్పుడు కాకుండా 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరిట మరో కంపెనీ ఆర్థిక కార్యకలాపాలు సాగించేదనే విషయం బయటి ప్రపంచానికి తెలీదు. అలా 1997 నుంచి 2006 వరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ యథేచ్ఛగా కార్యకలాపాలు సాగించింది.

భారీగా అక్రమ డిపాజిట్లు సేకరణ

ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా రామోజీరావు మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు సేకరించారు. డిపాజిట్ల సేకరణ పేరిట ప్రజలను మోసం చేయకుండా కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ స్పష్టమైన విధివిధానాలను నిర్దేశించింది. ఆర్‌బీఐ చట్టంలోని 45ఎస్ ప్రకారం కంపెనీల చట్టం ప్రకారం నమోదైన ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మాత్రమే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలి. రామోజీరావు తన గ్రూపు సంస్థలను 'హిందూ అవిభాజ్య కుటుంబం(హెచ్‌యూఎఫ్)' కింద నమోదు చేసినట్టుగా పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ కింద నమోదైన కంపెనీలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదు. కానీ చట్టానికి తాను అతీతం అని భావించే రామోజీ ఈ నిబంధనను నిర్భీతిగా బేఖాతరు చేశారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట యథేచ్ఛగా డిపాజిట్లు వసూలు చేశారు. 2006లో మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చే నాటికి ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లను సేకరించడం విభ్రాంతికర వాస్తవం. కాగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై కేసు న్యాయస్థానంలో విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్ల వరకు అక్రమ డిపాజిట్లు సేకరించారని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది నిరంజన్ రెడ్డి సుప్రీంకోర్టుకు నివేదించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

> ఈనాడు పత్రికాధిపతి చెరుకూరి రామోజీరావు ఆర్థిక నేరస్తుడే అన్నది నిగ్గు తేలింది. టీడీపీ అధినేత చంద్రబాబు రాజగురువు రామోజీ ఆర్థిక ఉగ్రవాదేనన్నది స్పష్టమైంది. 'మార్గదర్శి' ముసుగులో భారీగా నల్లధనం దందా నిర్వహిస్తున్నారన్నదీ రూఢీ అయ్యింది. అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు తొడుక్కున్న 'పత్రికా స్వేచ్ఛ' అనే ముసుగు తొలగిపోయింది. చట్టాలను ఉల్లంఘిస్తూ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ రామోజీ నిజ రూపంలో అవినీతి దిగంబరుడిగా నిలబడ్డాడు.

> మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్లు వసూలు చేసిందని ఆర్‌బీఐ స్పష్టం చేయడంతో ఈ కేసులో తరువాత పరిణామాలు ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. అక్రమ డిపాజిట్ల కేసు నిరూపితమైతే ఏకంగా రెట్టింపు జరిమానా అంటే రూ.5.200 కోట్ల జరిమానాతోపాటు కనీసం రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలుశిక్ష విధించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు.



తప్పు ఒప్పుకోక తప్పని రామోజీ

మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల దందా బయటపడటంతో రామోజీరావు కంగుతిన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలపై దర్యాప్తు చేసేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు రంగాచారిని విచారణ అధికారిగా నియమించింది. ఈ అక్రమాలపై సీఐడీ తరపున న్యాయ స్థానాల్లో కేసులు దాఖలు చేసేందుకు టి.కృష్ణంరాజును అధీకృత అధికారిగా నియమించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించినట్టు వీరు గుర్తించారు. కాగా తాము చట్టాన్ని ఉల్లంఘించలేదని బుకాయించేందుకు రామోజీ యత్నించారు. హెచ్‌యూఎఫ్‌గా తాము ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించవచ్చని అడ్డగోలుగా వాదించారు. కానీ సెక్షన్ 45 ఎస్ ప్రకారం హెచ్‌యూఎఫ్‌లు డిపాజిట్లు సేకరించకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. దాంతో తాము తప్పు చేసినట్టు రామోజీరావు అంగీకరించారు. నగదు రూపంలో డిపాజిట్లు వసూలు చేసినట్టు కూడా సమ్మతించారు. తమ తప్పును అంగీకరిస్తూ డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్లను తిరిగి చెల్లించేస్తామని, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను మూసి వేస్తామని న్యాయస్థానానికి లిఖిత పూర్వకంగా తెలిపారు.

వివరాలు చెప్పం అని వితండవాదం

తాము అక్రమంగా వసూలు చేసిన డిపాజిట్లను సంబంధిత డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని రామోజీరావు న్యాయస్థానానికి తెలిపారు. కాగా అక్రమ డిపాజిట్లు ఎవరెవరి నుంచి సేకరించారు.. ఎవరెవరికి తిరిగి చెల్లించారో ఆ వివరాలు వెల్లడించాలని సీఐడీ, ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరినప్పటికీ రామోజీరావు సమ్మతించ లేదు. ఆ వివరాలు తాము వెల్లడించాల్సిన అవసరం లేదని వితండ వాదం చేశారు. కాగా అక్రమంగా డిపాజిట్లు వసూలు చేసిన రామోజీరావును ప్రాసిక్యూట్ చేయాలని అధీకృత అధికారి కృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను ఉమ్మడి హైకోర్టు తన చివరి పని దినాన కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ.. డిపాజిట్దారుల వివరాలు వెల్లడించాలని కోరుతూ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం 2022లో ఇంప్లీడ్ అయ్యింది. డిపాజిట్‌దారుల వివరాలు వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు గత ఏడాది పేర్కొంది. కానీ ఇంత వరకు రామోజీరావు తమ డిపాజిట్‌దారుల వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం.

నల్లధనం దందా వల్లే గప్‌చుప్

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించిన 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' ముసుగులో రామోజీరావు భారీగా నల్లధనం దందాను సాగించారు.
- 2006 నాటికే ఏకంగా 32,385 మంది నుంచి రూ.2,600 కోట్ల వరకు అక్రమంగా డిపాజిట్లు సేకరించారని వెల్లడైంది. కానీ వారి పేర్లు, వివరాలను మాత్రం వెల్లడించేందుకు రామోజీరావు ససేమిరా అంటుండటం గమనార్హం. ఎందుకంటే ఆ డిపాజిట్ల ముసుగులో టీడీపీ పెద్దలు భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తీసుకువచ్చారు. అందుకే సీఐడీతోపాటు న్యాయస్థానం కోరినప్పటికీ వారి వివరాలను వెల్లడించేందుకు సమ్మతించడం లేదు.
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ రశీదు రూపంలో సేకరించిన డిపాజిట్ల పత్రాలను పరిశీలిస్తే అదంతా నల్లధనం బాగోతమేనన్నది స్పష్టమవుతోంది. డిపాజిట్‌దారుల పాన్ నంబర్లు, చిరునామాలు కూడా లేకుండానే డిపాజిట్లు సేకరించడం గమనార్హం.
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్‌దారులకు చెల్లించాల్సిన మొత్తం రూ.2,610.38 కోట్లుగా రామోజీరావు 2006లో తమ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కానీ 2008లో సమర్పించిన అఫిడవిట్‌లో రూ.1,864.10 కోట్లు చెల్లించేశామని తెలిపారు. మరి మిగిలిన రూ.800 కోట్ల డిపాజిట్లు ఏమయ్యాయనే విషయంపై మౌనం వహించారు. గుట్టు చప్పుడు కాకుండా రికార్డుల నుంచి తొలగించిన ఆ రూ.800 కోట్లు రామోజీకి అత్యంత సన్నిహితుడైన పచ్చ బాబు, ఆయన గ్యాంగ్‌వే అని తెలుస్తోంది. పోనీ చెల్లించామని చెబుతున్న రూ.1,864.10 కోట్ల డిపాజిట్లు ఎవరెవరికి చెల్లించారో చెప్పడానికి రామోజీ ససేమిరా అంటున్నారు.

బాబుకు రెస్ట్!

35 ఏళ్లుగా పోటీ చేస్తున్నారు... రెస్ట్ అవసరమన్న భార్య

ఈ సారి కుప్పంలో పోటీ చేయాలనుకుంటున్నానన్న భువనేశ్వరి

ఈ మాటల వెనక కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం చంద్రబాబుదే

'సిద్ధం' సభలకు వెల్లువలా వస్తున్న జనాన్ని చూసి వెన్నులో వణుకు

(సాక్షి, అమరావతి-తిరుపతి-శాంతిపురం)



"35 ఏళ్లుగా మీరు చంద్రబాబు నాయుడు గారిని గెలిపిస్తున్నారు. ఇక ఆయనకు రెస్ట్ ఇవ్వాలనిపిస్తోంది. అందుకే ఈ సారి ఇక్కడి నుంచి నేను పోటీ చేయాలనుకుంటున్నాను" అంటూ చంద్రబాబు నాయుడి భార్య నారా భువనేశ్వరి బుధవారం కుప్పంలో ఓ బహిరంగ సభలో స్పష్టంగా చెప్పారు.

స్కిల్ కుంభకోణంలో వేల కోట్లు నేరుగా విత్‌డ్రా చేసుకుని మింగేసిన కేసులో ఈ మధ్య చంద్రబాబు నాయుడిని పోలీసులు అరెస్టు చేయటంతో ఆయన జైలుకు వెళ్లటం తెలిసిందే. అది జరిగిన 10–15 రోజుల తరవాత కూడా ఆయన జైలు జీవితాన్ని చూసి తట్టుకోలేక కొందరు మరణించారన్నది టీడీపీ-ఎల్లో మీడియా వ్యాఖ్యానం. వారందరికీ సాయం చెయ్యడానికి నేరుగా నారా భువనేశ్వరి ఓ యాత్ర చేస్తున్నారు. ఆమేమీ రాజకీయ నాయకురాలు కాదు. దీంతో యాత్రలో భాగంగా ఎక్కడికి వెళ్లాలి? ఎవరెవరిని కలవాలి? ఎవరికి చెక్కులివ్వాలి? ఏమేం మాట్లాడాలి? అనేది మొత్తం స్క్రిప్టు ప్రకారమే చేస్తున్నారు. బుధవారం మాట్లాడిన మాటలు కూడా ఆ స్క్రిప్టులో భాగమే. కళ్లెదుట ఓటమి స్పష్టంగా కనిపిస్తుండడంతో ఏదో ఒక వంకతో అక్కడి నుంచి పోటీ చేయకుండా జారుకోవాలనేది బాబు పన్నాగమని, అందుకే భార్యతో ఆ మాటలు మాట్లాడించారు తప్ప అవేమీ చమత్కారమో, యథాలాపమో కావని టీడీపీ వర్గాలే చెబుతున్నాయి.

కుప్పంలో పడిపోయిన బాబు గ్రాఫ్...

కుప్పం బరి నుంచి పక్కకు తప్పుకొని వేరే నియోజకవర్గం చూసుకోవాలని, లేకపోతే ఈ సారి ఎన్నికల్లో పోటీయే చేయకుండా నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా వ్యవహరించాలని బాబు ఆలోచిస్తున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కుప్పంలో బాబు గ్రాఫ్ అంతకంతకూ దారుణంగా పడిపోవటం దీనికి మొదటి కారణం. నిజానికి 2019 ఎన్నికల్లోనే ఆయన మెజారిటీ బాగా తగ్గిపోవటం నుంచి ఈ గ్రాఫ్ పతనం మొదలయింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు చేతి నుంచి కుప్పం జారిపోయింది. మున్సిపల్ ఎన్నికల్లో కుప్పం మున్సిపాలిటీని వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంది. 25 వార్డుల్లో టీడీపీ కేవలం 7 వార్డుల్లో గెలవగా మిగిలిన 18 వార్డుల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. అంతకుముందు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 89 పంచాయతీలకు గాను 70 పంచాయతీలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. నాలుగు జెడ్పీటీసీలు, నాలుగు ఎంపీపీ స్థానాల్లో కూడా టీడీపీ ఓడిపోయింది. ఈ ఫలితాలన్నీ కుప్పంలో చంద్రబాబు పని అయిపోయినట్లేనని స్పష్టంగా చెప్పాయి.

'సిద్ధం' సభలతో ఉక్కిరి బిక్కిరి

చంద్రబాబు ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలోనూ 'రా... కదలిరా' పేరిట సభలు నిర్వహించారు. మరోవైపు లోకేశ్ 'శంఖారావం' పేరుతో సభలు పెట్టారు. ఇక నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' అంటూ సమావేశాలు పెడుతున్నారు. వైఎస్సార్ సీపీ తరఫున వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే... 'సిద్ధం' అంటూ సభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. బాబు...లోకేశ్... భువనేశ్వరి సభలన్నిట్లోనూ కలిపినా... రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వచ్చిన జనాల్లో సగం కూడా రాలేదు. 'సిద్ధం' సభలు మూడూ ఒకదాన్ని మించి మరొకటి జనసంద్రాలయ్యాయి. జనం నాడి అర్థమైన చంద్రబాబుకు వణుకు మొదలైంది. అందుకే పొత్తులతోనైనా ఎలాగోలా పరువు నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కుప్పంలో కూడా తాను ఓడిపోతే పరిస్థితి దయనీయంగా మారుతుందని, పార్టీ చేజారిపోతుందని అర్థమై.. ఈ సారికి వేరే చోట నుంచి పోటీ చెయ్యడమో... లేకపోతే ఎక్కడా పోటీ చేయకుండా నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌లా వ్యవహరించి పరువు నిలుపుకోవటమో చేయాలని చూస్తున్నారన్నది పార్టీ వర్గాల మాట.

బీఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తేలేదు

- అభివృద్ధి కోసమే మా నేతలు మంత్రులను కలిశారు
- హామీలు నెరవేర్చని కాంగ్రెస్ సర్కార్
- బీజేపీ అత్యధిక స్థానాలు గెలుస్తుంది
- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీ ఎలాంటి పొత్తులు లేకుండా అధిక స్థానాలు గెలుస్తుందని, బీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీతో పొత్తు పెట్టుకుంటామంటూ బీఆర్ఎస్ చేస్తున్నవన్నీ బూటకపు ప్రచారాలేనని, ఆ పార్టీతో ఎలాంటి పొత్తు ఉండదని స్పష్టం చేశారు. రజాకార్లను పెంచి పోషించే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లే కలిసి పని చేస్తాయన్నారు. ప్రజల్లో నుంచి పూర్తిగా కనుమరుగవుతున్నందునే బీఆర్ఎస్ ఇలాంటి పొత్తుల బూటకపు ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ విస్మరిస్తోందన్నారు. రాహుల్‌గాంధీని తీసుకొచ్చి వరంగల్ డిక్లరేషన్ పేరిట రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలనే నెరవేర్చని పార్టీ ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్ని మాయమాటలు చెబుతుందో ప్రజలు చూడాలన్నారు.

పార్టీ మారడం లేదు..

రానున్న ఎన్నికలతోపాటు భవిష్యత్తులోనూ బీజేపీ అత్యధిక స్థానాలను గెలుస్తుందని, తెలంగాణలో అధికారంలోకి వస్తుందని మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. తమ పరిధిలో అభివృద్ధి పనుల కోసం కొంతమంది తమ పార్టీ నేతలు మంత్రులను కలిశారని చెప్పారు. తమ నేతలెవరూ పార్టీని వీడడం లేదని, ప్రతిపక్ష నాయకులే బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ చేపట్టిన విజయ సంకల్పయాత్రలో భాగంగా తాను చేవెళ్ల, ఖమ్మం, కొత్తగూడెం, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల్లో పాల్గొంటానని ఏలేటి చెప్పారు. సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తాం

- తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం బట్టిసావర్‌గాం శివారు సర్వేనంబర్ 72/22, 72/23 ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాల పట్టాలివ్వడంతో పాటు మౌలిక వసతులు కల్పించేంత వరకు ఉద్యమిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మంగళవారం ధర్నా చేసిన వారు బుధవారం ఆదిలాబాద్ చేరుకున్నారు. అనంతరం కుమురంభీం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా బట్టిసావర్‌గాం శివారులోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో కలెక్టర్‌తో పాటు ప్రజా ప్రతినిధులకు కలిసి కూడా విన్నవించామన్నారు. ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌కు కూడా పాదయాత్ర చేపట్టామన్నారు. ఈ క్రమంలో పోలీసులు ఆర్మూర్ సమీపంలో తమను అరెస్టు చేసి ఆదిలాబాద్‌కు తీసుకువచ్చారన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పరిష్కరించ లేదన్నారు. ఈ క్రమంలోనే తాజాగా చలో ఇందిరాపార్కు ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఆయన వెంట తుడుందెబ్బ నేతలు పాల్గొన్నారు.

'హోటల్ నిర్మాణానికి స్థలం గుర్తించాలి'

నేరడిగొండ(బోథ్): కుంటాల జలపాతం వద్ద నిర్మించతలపెట్టిన హరిత (రిసార్ట్) హోటల్ కోసం స్థలాన్ని వెంటనే గుర్తించి సంబంధిత శాఖకు అప్పగించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తహసీల్దార్ సంతోష్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కుంటాల జలపాత పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హరిత హోటల్ నిర్మించడంతో స్థానికులకు ఉపాధి లభించడంతో పాటు పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పీవో వెంట డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్, ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు, ఆర్‌ఐ నాగోరావు, ఎఫ్ఆర్‌వో గణేశ్, ఎఫ్‌బీవో సచిన్, గ్రామస్తులు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన కానిస్టేబుళ్లకు శిక్షణ షురూ


మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సజయ్‌జాన్‌రావు


శిక్షణకు హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: కానిస్టేబుల్‌గా ఎంపికైన వారికి జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో బుధవారం శిక్షణ ప్రారంభమైంది. అదనపు ఎస్పీ సమయ్‌జాన్‌రావు శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారికి తొమ్మిది నెలల పాటు శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. పరేడ్, మాబ్ ఆపరేషన్, వెపన్ హ్యాండ్లింగ్, ఫైరింగ్, లా అండ్ కంట్రోల్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీఐ ప్రవీణ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మురళి, నవీన్, కార్తీక్ పాల్గొన్నారు.

తొలిమొక్కు రాజన్నకే!

- కాకతీయుల నుంచి కొనసాగుతున్న ఆచారం
- మేడారానికి ముందు వేములవాడ రాజన్న దర్శనం
- రోజూ 60 వేల మంది.. వారాంతాల్లో లక్ష దాటుతున్న సంఖ్య
- ఇప్పటివరకు దర్శించుకున్న 24లక్షల మంది
- రూ.21 కోట్లు దాటిన రాజన్న హుండీ ఆదాయం


భక్తులు.. రంగురంగుల విద్యుదీపాల వెలుగుల్లో వేములవాడ రాజన్న ఆలయం

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

దక్షిణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర మొదలైంది. కోట్లాది భక్తుల కొంగు బంగారంగా పిలిచే సమ్మక్క జాతర ప్రారంభానికి ముందే రాజన్నను దర్శించుకునే ఆనవాయితీ అనాదిగా వస్తోంది. సాధారణ రోజుల్లో దక్షిణ కాశీగా పిలిచే వేములవాడ సందర్శించే భక్తుల సంఖ్య 20వేలకు అటూఇటూగా ఉంటుంది. కానీ, మేడారం జాతరకు ముందు వచ్చే సంక్రాంతి తరువాత అమాంతంగా ఈ సంఖ్య పెరుగుతుంది. గత సంక్రాంతి మరునాటి నుంచి రాజన్నకు భక్తుల తాకిడి మొదలైంది. జనవరి 16 నుంచి రోజుకు 60వేలకు పైగా భక్తులు రాజన్న వద్దకు వచ్చారు. అదే శని, ఆది, సోమవారాల్లో 80వేల నుంచి లక్ష వరకు భక్తులు ఆలయానికి పోటెత్తుతున్నారని ఆలయ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటివరకు 24లక్షల మందికి పైగా భక్తులు రాజన్నకు తమ మొక్కులు సమర్పించుకున్నారని అంచనా.

నేపథ్యం?

ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన వేడుకగా సమ్మక్క–సారలమ్మ జాతర గుర్తింపు పొందింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు మేడారం వస్తారు. వీరిలో ముఖ్యంగా తెలంగాణ ఉత్తర భాగాన ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఖమ్మం జిల్లాల నుంచి మేడారానికి ముందు వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకునే సంప్రదాయం 13వ శతాబ్దం నుంచి కొనసాగుతోంది. వాస్తవానికి కాకతీయ రాజుల్లో చివరి వాడైన ప్రతాప రుద్రునికి సమ్మక్క–సారలమ్మలకు యుద్ధం జరిగింది. కాకతీయులు శివుని భక్తులు. అందుకే తమ సామ్రాజ్యంలో శ్రీరాజరాజేశ్వరుని కులదైవంగా కొలుస్తూ అనేక ప్రదేశాల్లో ఆలయాలు నిర్మించారు. అలా కాకతీయ ప్రజలు కూడా ఏ పని తలపెట్టినా.. శ్రీరాజరాజేశ్వరుని మొక్కడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే మేడారం జాతర ప్రారంభానికి ముందు నుంచి వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఉత్తర తెలంగాణ భక్తులకు సంప్రదాయంగా మారింది.

వారాంతాల్లో కిటకిట..

మేడారానికి ముందు వచ్చే భక్తులను నియంత్రించడం ఆలయ అధికారులకు కత్తి మీద సాములా ఉంటుంది. సాధారణ రోజుల్లో 20వేలుగా వచ్చే భక్తులు ఇప్పుడు మూడింతల రెట్టింపు అంటే 60వేలకు పైగా వస్తున్నారు. అదే వారాంతాలు శని, ఆది, సోమవారాల్లో దర్శనానికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా శివుని భక్తులు పోటెత్తుతున్నారు. అయినా వారికి సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక మేడారానికి ముందు రాజన్న వద్దకు వచ్చిన భక్తులు స్వామివారికి సమర్పించుకున్న కానుకలు కూడా భారీస్థాయిలో ఉండటం గమనార్హం. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 20 వరకు భక్తులు రాజన్నకు సమర్పించిన కానుకల విలువ రూ.21కోట్లు దాటిందని అధికారులు అంచనా వేస్తున్నారు. మేడారం జాతర ముగిసే సమయానికి రాజన్న హుండీ ఆదాయం మరింత పెరిగే అవకాశముంది.

ఘనంగా నృసింహస్వామి కల్యాణం


స్వామివారిని పల్లకిని మోస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు

సారంగాపూర్: బీర్‌పూర్‌లోని లక్ష్మీనృసింహస్వామి కల్యాణం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేక వేదికను వివిధ పుష్పాలతో అలంకరించారు. ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల మధ్య వేదికపైకి తీసుకొచ్చారు. వివిధ గ్రామాల నుంచి వందలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. స్వామివారిని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దర్శించుకున్నారు. ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి దంపతులు, ఏడీఈ హరీశ్, బీర్‌పూర్, సారంగాపూర్ తహసీల్దార్లు నరేశ్, రమేశ్, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పొల్సాని నవీన్ రావు, ఆలయ చైర్మన్ సామ్రాట్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, ఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న మహేశ్ భగవత్, పీటీసీ ప్రిన్సిపల్ శ్రీనివాస్, డీఎస్పీలు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: భగవత్

కరీంనగర్‌క్రైం: మారిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రైల్వేస్ అడిషనల్ డీజీ మహేశ్ ఎం.భగవత్ అన్నారు. బుధవారం రాంనగర్‌లో గల పోలీసు ట్రైనింగ్ కళాశాలలో(పీటీసీ) ఇటీవల ఎంపికైన సివిల్ పోలీసు కానిస్టేబుళ్ల 9 నెలల శిక్షణ ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉన్నతాధికారులు, శిక్షణాధికారులు చెప్పిన మెలకువలు సద్వినియోగం చేసు కోవాలన్నారు. సైబర్ క్రైంలు, నివారణ, జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, డీఎస్పీలు మల్లికార్జున్, విజయపాల్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్, నల్గొండ, గద్వాల నుంచి వచ్చిన కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.